క్లుప్తంగా

ఎంటమాలజీ సిబ్బందికి కిట్ల పంపిణీ



పీపీఈ కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: నిరంతరం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యక్తిగత రక్షణ కిట్లను అందిస్తున్నట్లు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల నివారణకు ఎంటమాలజీ సిబ్బంది నిరంతరం చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, నివాసాలు, తొట్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రవీందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు,

మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్ యాదవ్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ జోన్‌పరిధిలోని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా శంకర్‌కుమార్ నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అంతకు ముందు ఆయన భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం నల్లపోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆయనను శాలువతో ఘనంగా సత్కరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చాదర్‌ఘాట్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈనెల 25న ముస్లిం మెటర్నిటీ హాస్పిటల్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ బదిలీ

చైతన్యపురి: చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న. జి వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కె.సైదులును చైతన్యపురి ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేస్తూ రాచకొండ సీపీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్‌రావును మహేశ్వరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా

మాన్సూన్ స్పెషల్ డ్రైవ్

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్
- ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత
- ఎల్‌బీనగర్ డివిజన్‌లో కమిషనర్ పర్యటన



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఎల్‌బీనగర్: ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా గ్రేటర్ పరిధిలో మాన్సూన్ స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టామని, ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాల్లో అధికారులు, కాలనీ ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. కాలనీల వాసులు రోడ్లపైన చెత్త వేయకుండా చెత్త బుట్టల్లోనే వేయాలని సూచించారు, ఇంటికి వచ్చిన స్వచ్ఛ ఆటోలకు చెత్త అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చునన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రోడ్లు, కాలనీలు, బహిరంగ ప్రదేశాల్లో పేరుకు పోయిన చెత్త చెదారాన్ని కార్మికులు తొలగించారు, మురుగు కాలువలను శుభ్రం చేసి నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. దోమల బెడదను నివారించడానికి ఎంటమాలజీ అధికారులు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు.

ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాలు చొరవ చూపాలి

నగరంలో కొనసాగుతున్న శానిటేషన్ డ్రైవ్‌లో ప్రజా ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ పిలుపు నిచ్చారు.వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున శానిటేషన్ డ్రైవ్‌ను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.10 రోజుల పాటు నగర వ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక డ్రైవ్ రెండు రోజుల్లో 30 వార్డుల చొప్పున పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రతి వార్డులో అధికారులు, సిబ్బంది ఉదయం 5.30గంటల నుంచి 1.30 గంటల వరకు పారిశుద్ధ్య కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. సేకరించిన చెత్తను వెంటనే అక్కడి నుంచి తొలగించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆయన వనస్థలిపురం కాంప్లెక్స్‌లోని ఓ టీస్టాల్‌ను పరిశీలించి ట్రేడ్ లైసెన్స్ ఉందా అని ప్రశ్నించారు. దీంతో టీస్టాల్ యజమాని ట్రేడ్ లైసెన్స్‌ను చూపించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి జోనల్ ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ మల్లికార్జున్‌రావు, ఈఈ కార్తీక్‌రెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ నగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు,

ఆడిటోరియం నిర్మాణానికి చర్యలు



అధికారులో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

వనస్థలిపురం: వనస్థలిపురంలో హెచ్‌ఎండీఏ ఓపెన్ ఆడిటోరియం స్థలంలో అత్యాధునికమైన ఆడిటోరియం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. మంగళవారం ఆయన ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి స్థానిక ఓపెన్ ఆడిటోరియంను పరిశీలించారు. త్వరలోనే వనస్థలిపురంలో మినీ ఆడిటోరియం భవనం నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ మల్లికార్జునరావు, ఈఈ అశోక్‌రెడ్డి, ఏసీపీ ప్రతాప్, డీఈ రఫీ, ఏఈ విష్ణుశ్వరి, పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహార బండ్ల ఊరేగింపు



అమ్మవారి పూజలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, చేకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ, టీపీసీసీ మాజీ ప్రధానకార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు పోతురాజులు, శివసత్తులు, తీన్మార్ డ్యాన్స్‌లు, జానపద ఆట పాటలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి జరిగిన ఫలహారపు బండ్లు, ఘట్టాలు ఊరేగింపునకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సినీ నటి జయప్రద, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజ్‌ఠాకూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ సంస్కృతికి నిదర్శనమన్నారు. స్థానిక పోచమ్మ దేవాలయంలో మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీనివాస్ ప్రముఖులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్, యాదిలాల్, కృష్ణ, సాయిరామ్, కిషన్‌సింగ్, షాహేద్‌ఖాన్, రాహుల్‌సింగ్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ఫలహార బండి ఊరేగింపులో.. సినీ నటి జయప్రద, ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

పార్కుల్లో పచ్చదనం పెంపొందించాలి



కళ్యాణ్‌నగర్ పార్కులో మొక్కలు నాటిన కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని పార్కుల్లో పచ్చదనం పెంపొందించేందుకు సమష్టిగా కృషి చేయాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సైదాబాద్ కళ్యాణ్‌నగర్ కాలనీలోని పార్కులో ఆమె హార్టికల్చర్ అధికారులు, కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీవాసులు పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరేలా అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ మేనేజర్ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ రవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, కాలనీవాసులు గోవింద్ రాజు, స్వాతి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని ఎల్‌పీటీ మార్కెట్ సమీపంలోని హైరైజ్ అపార్ట్‌మెంట్‌లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధాన రోడ్డుపై ఉన్న షాగౌస్ యాజమాన్యం రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు కొన సాగిస్తున్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయంపై హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇక్కడే ఆర్టీసీ బస్టాప్ ఉండటంతో ప్రయాణికులు మూత్రవిసర్జన చేస్తున్నారని, ప్రైవేటు వాహనాలను రోడ్డుపై అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ డీఈ నీలిమ, అసోసియేషన్ నేతలు ఉమా మహేశ్వర్‌రెడ్డి, సతీష్, కేఎంరెడ్డి, పరమేశ్వర్, సారథి, అనంతరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన



పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న జాగృతి పోలీస్ కళాబృందం

మలక్‌పేట: సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్(సీడీ ఈడబ్ల్యూ) సైదాబాద్, ఉమెన్ సెఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ అనిబిసెంట్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంస్థ ప్రతినిధులు మహిళలపై జరుగుతున్న హింసలు, గృహ హింసలపై అవగాహన కల్పించారు. గృహ హింసకు గురవుతున్న బాధిత మహిళకు, వారి కుటుంబ సభ్యులకు సీడీఈడబ్ల్యూ కేంద్రాల్లో కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. నగరంలో 30 కేంద్రాలు బాధిత మహిళలకు అండగా ఉన్నాయన్నారు. ఉమెన్ సెఫ్టీ వింగ్ ద్వారా మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన కలిప్తున్నామన్నారు. షీ టీమ్స్, భరోసా, టీ–సేఫ్ యాప్, సహాస్,(పోక్సోయాక్ట్), డయల్ 100, 181 సేవలను వివరించారు. ఈ సందర్భంగా జాగృతి పోలీస్ కళాబృందం నల్లగొండ వారు కళా ప్రదర్శనల ద్వారా మహిళలు ఎదుర్కొంటున్న హింసలు, రక్షణ చట్టాలపై పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో మలక్‌పేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి, కళాబృందం ఇన్‌చార్జి షేక్ హుస్సేన్, సభ్యులు చంద్రశేఖర్, పురుషోత్తం, సత్యం, మురళీ, కళాశాల లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

మన్సూరాబాద్: గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వేణుమాధవ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.45, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.55, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.47, దోసకాయ రూ.13, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.26, మునగ రూ.28.

అంతర్గత రహదారుల నిర్మాణానికి చర్యలు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె సంజీవయ్యనగర్‌లో రూ.12 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో అంతర్గత రోడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బస్తీ వాసులు శంకర్, ప్రభాకర్, భూషణం, ఇలియాస్, దౌలత్‌ఖాన్, బీజేపీ నాయకులు దేవేందర్, రాజేష్, పరశురామ్, సంతోష్, పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులతో ట్రాఫిక్ ఎస్‌ఐసోమనాథ్, పాఠశాల సిబ్బంది

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థి దశలోనే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ట్రాఫిక్ ఎస్‌ఐ సోమనాథ్, నారాయణ స్కూల్ ఏజీఎం హేమంబర్ అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం నారాయణ స్కూల్‌లో ఇన్‌వెస్ట్ ట్యూర్ సెర్మనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్ తో పాటు ఇతర విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలతో పాఠశాల సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సమీన, ఏఓ రమేష్, రవి ప్రసాద్, స్వామినాథ్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు సత్కారం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపోలో మంగళవారం ప్రగతి చక్ర, ఆదర్శ ఉగ్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఉత్తమ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లతో సహా 25మంది ఉద్యోగులను డిపో మేనేజర్ కె.కృష్ణమూర్తి సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మట్లాడుతూ తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధికి పాటుపడుతూ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక కావటం తమ డిపోకు గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఏఎంటి ఉషశ్రీ, ఎంఎఫ్ సతీష్, డిప్యూటి సూపరిండెంట్ కె. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ మలక్‌పేటలోని పోచమ్మ దేవాలయంలో..



సరూర్‌నగర్ వీఎంహోం లోని పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు




భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు


- కిటకిటలాడిన నాగదేవత ఆలయాలు
- పుట్టల వద్ద బారులు తీరిన భక్తులు
- పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు

శ్రావణ మాసం నాగుల పంచమిని పురస్కరించుకుని మంగళవారం మలక్‌పేట్, ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని శివాలయాలు, నాగదేవత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ దోషాలు ఉన్న వారు ప్రత్యేకంగా తమ గోత్రనామాలతో ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు, చేశారు. పలు ప్రాంతాల్లోని పుట్టల వద్ద పాలు పోసేందుకు మహిళలు బారులు తీరారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

దిల్‌సుఖ్‌నగర్,ఎల్‌బీనగర్ జోన్ బృందం



మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయంలో ..



సలీంనగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద..



సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయస్వామి దేవాలయంలో..

కొత్త రేషన్ కార్డులొచ్చేస్తున్నాయ్...

- ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో రేషన్ కార్డుల మంజూరుకు సన్నాహాలు
- కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు 33,373 మంది
- ఇప్పటి వరకు మంజూరైనవి 3400
- శరవేగంగా దరఖాస్తుల పరిశీలన



ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో పేదలకు త్వరలోనే రేషన్ కార్డులు అందనున్నాయి. గత కొన్నేళ్లుగా రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారికి ఈ నెలలోనే కొత్త కార్డులు మంజూరు కానున్నాయి. 2014–2024 వరకు కార్డులు మంజూరు కాకపోవడంతో ప్రజలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ సేవలకు రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో నిమ్స్ తదితర ఆసుపత్రుల్లో వైద్య సేలు అందక అవస్థలు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల ప్రక్రియ చేపట్టడంతో పెద్ద సంఖ్యలో పలువురు ప్రజాపాలనలో దరఖాస్తులను అందజేశారు. అయితే రెండేళ్లు గడిచినా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ప్రజలు తీవ్ర అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టి లో ఉంచుకుని ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరును వేగవంతం చేయాలని అదేశించడంతో కార్డుల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. పదిరోజుల్ల కార్డుల పరిశీలన పూర్తి చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది దరఖాస్తుల పరిశీలన ముమ్మరం చేశారు.

ఎల్‌బీనగర్ నియోజకవర్గం 11 డివిజన్లతో పాటు మహేశ్వరంలోని రెండు డివిజన్లతో కలిపి కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సర్వే జరుగుతోం. రేషన్ కార్డుల కోసం దాదాపు 37,373 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇప్పటి వరకు సుమారు 3400 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. గత పదేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగింది. వేల సంఖ్యలో దరఖాస్తులు అందినా సివిల్ సప్లయ్ శాఖ వద్ద సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లబ్ధిదారులకు ఆశలు చిగురించాయి. లబ్ధిదారులను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు అదనపు సిబ్బందిని నియమించి సర్వేను ముమ్మరం చేశారు.

10 రోజుల్లో సర్వే పూర్తి....



కొత్త రేషన్ కార్డుల మంజూరు చేసేందుకు చేపట్టిన సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలని అదేశాలు జారీ చేశాం. పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్నాం. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేజేస్తాం. పాత రేషన్ కార్డుల్లో లేని పేర్లను ఇప్పుడు చేర్చేందుకు, లేని వారి పేర్లను తొలగించేందుకు మీ సేవా ద్వారా మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

(పుల్లయ్య. ఏఎస్‌ఓ. సరూర్‌నగర్,)